# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 53 | పేజీలు: 4 | వెల: 4/- | శనివారం ● 14, సెప్టెంబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## నేటి నుంచి నాలుగు రోజులు హాలిడేస్..!

**హైదరాబాద్, సెప్టెంబరు 13(నమస్తే ఉదయం):** నేటి నుంచి అంటే శనివారం నుంచి మంగళవారం వరకు వరుసగా ప్రభుత్వ కార్యాలయాలకు, స్కూళ్లకు, కాలేజీలకు సెలవులు రానున్నాయి. రేపు (14) రెండో శనివారం కాగా ఎల్లుండి (15) ఆదివారం. ఇక సోమవారం 16 వ తేదీన ముస్లింల పండుగ మిలాద్ -ఉన్ -నబీ. ఇక 17 మంగళవారం హైదరాబాద్ లో వినాయక నిమజ్జనం సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణ వ్యాప్తంగా మొదటి మూడు రోజులూ సెలవు కాగా నాలుగో రోజు వినా యక నిమజ్జనం జరిగే హైదరాబాద్‌లో మాత్రమే సెలవు ఉంటుంది. అదే విధంగా బ్యాంకు ఉద్యోగులకు కూడా మొదటి మూడు రోజుల సెలవు మాత్రమే వర్తిస్తుంది. నిమజ్జనం రోజు బ్యాంకులు యధావిధిగా పనిచేస్తాయి.







## శ్రీ జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి తుమ్మల

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 13 (నమస్తే ఉదయం):** శ్రీ జోగులాంబ అమ్మవారి దయవల్ల రాష్ట్ర ప్రజలు సుఖ: సంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం అలంపూర్ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించిన మంత్రికి దేవాలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ముందుగా శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయం సందర్శించి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. అనంతరం శ్రీ జోగులాంబ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు అమ్మవారి ప్రసాదం శేష వస్త్రం బహుకరించి ఆశీస్సులు అందజేశారు. అంతకుముందు మంత్రి హరిత హోటల్లో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ , జిల్లా ఎస్పీ తోట శ్రీనివాస రావు, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, ఆర్డిఓ రామచందర్, జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అలంపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## రైతును రాజు చేయడం ప్రభుత్వం ధ్యేయం

### - వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

### అలంపూర్ వ్యవసాయ మార్కెట్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 13(నమస్తే ఉదయం):** రైతును రాజు చేయడమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం అలంపూర్ వ్యవసాయ మార్కెట్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలంపూర్ మార్కెట్ యార్డ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పాటు చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయమని అన్నారు. వ్యవసాయపరంగా, విద్యాపరంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతున్నట్లు ఆయన తెలిపారు. తాను గతంలో నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులపై అవగాహన ఉందని అన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సస్యశ్యామలం అయితే తెలంగాణ యావత్తు సస్యశ్యామలం అవుతుందని అన్నారు. కృష్ణ తుంగభద్ర నదుల మధ్యన ఉన్న నడిగడ్డ ప్రాంతాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ఇప్పటి వరకు రైతుల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. ఇంకా రెండు లక్షల పైన ఉన్న రైతులకు సాంకేతికంగా పొరపాటు మిగతా.. 2లో



## నష్టం రూ.10,032 కోట్లు..!

- రాష్ట్రం మునిగినా ఎన్‌డీఆర్ఎఫ్ నిధులు వాడుకోలేని స్థితి
- ఎస్ఎస్ఆర్, ఎన్‌డీఆర్ఎఫ్‌కు పొంతన లేకపోవడం వల్లే..
- 1350 కోట్ల నిధులున్నా రూపాయి వాడుకోలేకపోతున్నాం
- విపత్తు నిధులపై ఉన్న నిబంధనలను కేంద్రం సడలించాలి
- మున్నేరు ముప్పు నివారణకు రిటైనింగ్ వాల్ తప్పనిసరి
- నిర్మాణానికి కేంద్రం సహకరిస్తే మా వాటా నిధులిస్తాం
- వైపరీత్యాలపై హెచ్చరికల కోసం ఓ వ్యవస్థ ఉండాలి: సీఎం
- కేంద్ర బృందంతో భేటీ.. 10 వేల కోట్ల నష్టంపై నివేదిక
- 'తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవానికి' రండి
- కేంద్ర మంత్రులు అమిత్ షా, గజేంద్రసింగ్, కిషన్‌రెడ్డి, సంజయ్‌లకు సీఎం రేవంత్ ఆహ్వానం

**హైదరాబాద్,సెప్టెంబర్ 13 (నమస్తే ఉదయం):** విపత్తుల నిధుల వినియోగానికి సంబంధించి అమల్లో ఉన్న కఠిన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం సడలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్‌లో రూ. 1,350 కోట్లు అందుబాటులో ఉన్నా.. ప్రస్తుత నిబంధనల ప్రకారం రూపాయి కూడా వాడుకునే పరిస్థితి లేదని కేంద్ర బృందాలకు వివరించారు. కేంద్రం నిబంధనల ప్రకారం.. ఒక కిలోమీటరు రోడ్డు దెబ్బతింటే కేవలం రూ.లక్ష ఖర్చు చేయాలని నిర్ణయించారని, ఈ రేట్ల ప్రకారం తాత్కాలిక మరమ్మతులు కూడా చేయలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన తెలంగాణకు తక్షణమే ఆర్థికసాయం అందించాలని.. ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు ఎలాంటి షరతులు లేకుండా నిధులు విడుదల చేయాలని కోరారు.

రాష్ట్రంలో వరదల వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర అధికారుల బృందంతో శుక్రవారం సచివాలయంలో రేవంత్ సమావేశమయ్యారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల రాష్ట్రంలో సంభవించిన అపార నష్టాన్ని కేంద్ర బృందాలకు ఆయన వివరించారు. ఇప్పటి వరకు వివిధ శాఖల నుంచి అందిన వివరాల ప్రకారం రూ. 10,032 కోట్ల నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఇది మధ్యంతర నివేదిక మాత్రమేనని, పూర్తి వివరాలు రావాల్సి ఉందని చెప్పారు. రాష్ట్రంలో జరిగిన నష్టంతోపాటు ఇక్కడ అమల్లో ఉన్న ఎస్ఎసఆర్ రేట్ల వివరాలను కూడా కేంద్రానికి నివేదిస్తామన్నారు. వాటిని పరిశీలించి విపత్తు సాయం అందించాలని సీఎం కోరారు.

### బాధితులకు ఇళ్ల కోసం నిధులివ్వాలి

వరదల వల్ల రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని కేంద్ర బృందాలకు రేవంత్ వివరించారు. పంట పొలాల్లో బండరాళ్లు, కంకర, మట్టి మేటలు వేయడంతో రైతులు కోలుకోలేనంత నష్టపోయారని పేర్కొన్నారు. చాలా చోట్ల రహదారులు, రోడ్లు, కల్వర్టులు, చెరువులు మిగతా.. 2లో





## క్లీన్ సిటీ కోసం ఇండోర్ మోడల్ అనుసరించండి


- ట్రాఫిక్ వలంటీర్లుగా ట్రాన్స్‌జెండర్లు!
- పనులు చేయని కాంట్రాక్టర్ల నివేదిక ఇవ్వండి
- జీహెచ్ఎంసీ పనులపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబర్ 13 (నమస్తే ఉదయం):** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ట్రాన్స్ జెండర్లను వలంటీర్లుగా నియమించే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. హోంగార్డుల తరహాలో ట్రాన్స్‌జెండర్ల నియాకమం చేపట్టాలన్నారు. దానివల్ల వారికి మిగతా.. 2లో

## జిఎస్టీ గురించి అడిగితే బెదిరింపులా?

- తమిళనాడు రెస్టారెంట్ యజమాని క్షమాపణలు
- నిర్మలా సీతారామన్ తీరుపై మండిపడ్డ ఖర్గే

**న్యూఢిల్లీ,సెప్టెంబర్13(నమస్తే ఉదయం):** ఆహార పదార్థాలపై జీఎస్టీ విషయంలో తమిళనాడుకు చెందిన 'శ్రీ అన్నపూర్ణ రెస్టారెంట్' యజమాని శ్రీనివాసన్ ఇటీవల ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న జీఎస్టీ



గురించి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ప్రశ్నించారు. రెస్టారెంట్లు ఎదుర్కొంటున్న సవాళ్లను తెలియజేశారు. అనంతరం ఓ ప్రైవేటు కార్యక్రమంలో ఆయన ఆర్థిక మంత్రిని కలిసి క్షమాపణలు చెప్పిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మిగతా.. 2లో



## తెలంగాణలో శాంతిభద్రతలు కరువు

- ఉద్యమంలోనూ ఇంతటి నిర్బంధం ఎదుర్కోలే
- మీడియాతో బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు

**హైదరాబాద్,సెప్టెంబర్13(నమస్తే ఉదయం):** పదేళ్లపాటు శాంతి భద్రతల సమస్య రాకుండా బీఆర్ఎస్ పాలన సాగిందని.. కానీ ఇప్పుడా పరిస్థితి లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుఅన్నారు.

తెలంగ్గాణ ఉద్యమ సమయంలో కూడా ఇంతటి నిర్బంధం ఎదుర్కోలేదని అన్నారు. హైదరాబాద్‌లోని నివాసంలో శుక్రవారం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం వెనక్కి వెళ్తోందని.. శాంతిభద్రతలు క్షీణిస్తుండటంపై పెట్టుబడిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. లా అండ్ ఆర్డర్ అదుపుతప్పడానికి మిగతా.. 2లో

## ప్రజాపాలనలో ప్రతిపక్షాలపై దాడులు దారుణం

- రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతల హౌజ్ అరెస్టులు
- ఎమర్జెన్సీ రోజులను అమలవుతున్నాయన్న కెటిఆర్



**హైదరాబాద్,సెప్టెంబరు13(నమస్తే ఉదయం):** రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలను పోలీసులు ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న బీఆర్ఎస్ నేతలను అర్ధరాత్రి వరకు అక్రమ అరెస్టులు చేసి.. ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా హౌస్ అరెస్టులు చేస్తారా? మిగతా.. 2లో




## పంజాబ్‌లోని పలు ప్రాంతాల్లో ఎన్ఐఎ దాడులు

- ఖలిస్తాన్ మద్దతుదారుల కూపీ లాగేందుకు చర్యలు

**చండీఘడ్,సెప్టెంబరు13(నమస్తే ఉదయం):** పంజాబ్‌లోని పలు ప్రాంతాల్లో జాతీయ భద్రతా సంస్థ (ఎన్ఐఏ) శుక్రవారం దాడులు నిర్వహించింది. పంజాబ్‌లోని మోగా, అమృత్‌సర్, గురుదాస్‌పూర్, మిగతా.. 2లో

## పోర్ట్‌బ్లెయిర్ ఇక శ్రీవిజయపురం

- పేరు మారుస్తూ కేంద్రం నిర్ణయం
- ఎక్స్ వేదికగా వెల్లడించిన హోంమంత్రి అమిత్ షా

**న్యూఢిల్లీ,సెప్టెంబర్13(నమస్తే ఉదయం):** అండమాన్ నికోబార్ దీవుల రాజధాని పోర్ట్ బ్లెయిర్ పేరును కేంద్ర ప్రభుత్వం మార్చింది. ఇకపై దానిని శ్రీ విజయపురంగా వ్యవహరించాలని నిర్ణయించింది. వలసవాద ఆనవాళ్ల నుంచి బయటపడేందుకు ఈ పేరును మార్చినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వలసవాద గుర్తుల నుంచి దేశానికి విముక్తి కల్పించాలన్న ప్రధాని మోదీ ఆశయాలకు అనుగుణంగా పోర్ట్ బ్లెయిర్ పేరును శ్రీ విజయపురంగా మార్చాలని నిర్ణయించాం. మునుపటి పేరు వలసవాద వారసత్వాన్ని సూచిస్తోంది. శ్రీ విజయపురం అనేది భారత స్వాతంత్ర్య పోరాటంలో సాధించిన విజయానికి ప్రతీక. నాటి పోరాటంలో అండమాన్ నికోబార్ పాత్ర





ఎంతో ప్రత్యేకంఅని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. చరిత్రతో పాటు స్వాతంత్ర్య పోరాటంలోనూ అండమాన్ నికోబార్ దీవులది కీలక పాత్ర అని అమిత్ షా మిగతా.. 2లో

## జైల్లో పెట్టి వేధించాలని చూశారు..



- నా మనోధైర్యం వందరెట్లు పెరిగింది
- తీహార్ జైలు నుంచి విడుదలయిన కేజ్రీవాల్

**న్యూఢిల్లీ,సెప్టెంబర్13(నమస్తే ఉదయం):** ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తిహార్ జైలు నుంచి విడుదలయ్యారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలతో అరెస్టయిన ఆయనకు శుక్రవారం సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు మిగతా.. 2లో

## రైతును రాజు చేయడం
# ప్రభుత్వం ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన రైతులకు రేషన్ కార్డు లేని రైతులకు ఈ నెలాఖరులోపు రుణమాఫీ చేస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 42 లక్షల మంది రైతులలో ఇప్పటి వరకు రెండు లక్షల లోపు రుణాలను మాఫీ చేయడానికి 31 వేల కోట్లు వెచ్చించామని తెలిపారు. రైతన్నను, నేతన్నను రెండు కళ్ళుగా చూసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేనేత కార్మికులకు 30 కోట్లు మాఫీ చేసిందన్నారు. ఈసారి పంటవేసిన రైతులకే రైతు భరోసా అందిస్తామని మంత్రి తెలిపారు. అకాల వర్షాల వల్ల ఖమ్మం జిల్లాలో అనేక మంది రైతులు నష్టపోయారని రాష్ట్రంలో కూడా రైతులు నష్టపోయిన సమగ్ర నివేదిక తెప్పించి న్యాయం చేస్తామని అన్నారు. రైతులకు పంట బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించి ఆదుకుంటుందని మంత్రి వెల్లడించారు. దేశవ్యాప్తంగా గద్వాల సీడ్ ప్రత్తి విత్తనాలకు డిమాండ్ ఉన్నందున ముఖ్యమంత్రితో చర్చించి ఆర్గనైజర్లతో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. తుమ్మిళ్ళ ఎత్తిపోతల పథకంలో భాగంగా మల్లమ్మ కుంట రిజర్వాయర్ను త్వరగా నిర్మించేందుకు ముఖ్యమంత్రితో చర్చించి పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. ఐజ వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధి కొరకు ప్రత్యేక దృష్టిసారిస్తామని మంత్రి తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేసే విధంగా ముఖ్యమంత్రితో మాట్లాడి పరిహారం ఉద్యోగం అందేలా చూస్తామన్నారు. బీచుపల్లి ఆయిల్ మిల్లు ఉత్పాదకకు మిషనరీలు ఇతర ఏర్పాట్లు చేయించి వచ్చే సంవత్సరం వరకు ప్రారంభించి ఇక్కడ నిరుద్యోగాన్ని రూపుమాపు తామని అన్నారు. ఆయిల్ ఫామ్ తోటలు పెంచడం వల్ల ప్రతి రైతుకు ఎకరాకు రూ. 1.50 లక్షల ఆదాయం లభిస్తుందని అన్నారు. రైతులు విరివిగా ఆయిల్ ఫామ్ తోటలను సాగు చేసి లబ్ధి పొందాలన్నారు. మారుతున్న కాలాన్ని బట్టి రైతులు నూతన సాంకేతిక పద్ధతులను అవలంబించి అధిక లాభాలు పొందాలని అన్నారు.మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... పాలమూరు జిల్లా వాసుడైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పథంలో నడిపిస్తారని తెలిపారు. ప్రజలకు అన్ని విధాల ఆదుకునేందుకు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించి ఇప్పటికే కొన్ని పథకాలు అమలు చేశామని అన్నారు. అలంపూర్, ఐజ వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బింగిదొడ్డి దొడ్డప్ప, వైస్ ఛైర్మన్ పచ్చర్ల కుమార్ గౌడ్, డైరెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు ఆర్డిఓ రామచందర్, మార్కెటింగ్ ప్రాంతీయ ఉపసంచాలకులు ప్రసాదరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

## క్లీన్ సిటీ కోసం ఇండోర్ మోడల్ అనుసరించండి

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధి కూడా కల్పించినట్లవుతుందని చెప్పారు. శుక్రవారం ఆయన సచివాలయంలో జీహెచ్ఎంసీ పౌర సేవల కోసం చేపట్టిన పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ను ఇండోర్ తరహాలో క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అక్కడ అనుసరిస్తున్న విదానాలను అధ్యయనం చేయాలని చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతంలో స్థలాలు సేకరించే సమయంలో అక్కడి నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని చెప్పారు. హైదరాబాద్లో సమగ్ర రహదారుల నిర్వహణ కార్యక్రమం (సీఆర్ఎంపీ) కింద ఐదేళ్ల క్రితం 811 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం చేపట్టారని, వాటి నిర్వహణను మాత్రం పట్టించుకోవడం లేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది డిసెంబరుతో కాంట్రాక్టు గడువు ముగిసిపోతుందని, రోడ్ల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏజెన్సీలను ఉపేక్షించవద్దని ఆదేశించారు. పనులు చేయని కాంట్రాక్టర్ల వివరాలతో 15 రోజుల్లోగా తనకు నివేదికను అందించాలని చెప్పారు. అలాగే, చెత్త సేకరణపైనా జీహెచ్ఎంసీ దృష్టి సారించాలని ఆదేశించారు.

అవసరమైతే జీఐఎస్, క్యూఆర్ స్కాన్ లాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సూచించారు. జీహెచ్ఎంసీలో నిరంతరం జరిగే పనులకు ఆర్థిక ఇబ్బంది లేకుండా స్పష్టమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని స్పష్టం చేశారు. అద్దెలు, ప్రకటనలు, హోర్డింగ్ల ద్వారా వచ్చే ఆదాయంపై సమీక్షించుకోవాలన్నారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ను ఆధునికీకరిస్తున్నందున పరిసరాల్లోని రోడ్లను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. పరిసరాల్లో ఉన్న అటవీ, పరిశ్రమల విభాగం భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని సూచించారు. అక్కడున్న పరిశ్రమలను మరో చోటుకు తరలించాలని చెప్పారు. స్టేషన్ ముందు పార్కింగ్, వాణిజ్య కూడలికి వీలుగా అప్రోచ్ రోడ్లు డిజైన్ చేసుకోవాలని తెలిపారు.

## పంజాబ్‌లోని పలు ప్రాంతాల్లో ఎన్ఐఎ దాడులు

(మొదటి పేజీ తరువాయి)

జలంధర్లో ఈ దాడులు జరిగాయి. కెనడాలోని ఒట్టావాలోని భారత హైకమిషన్‌పై ఖలిస్తాన్ మద్దతుదారులు దాడికి సంబంధించి ఈ దాడి జరిగింది. ఈ వ్యవహారంపై గతేడాది జూన్‌లో ఎన్ఐఏ కేసు నమోదు చేసింది. ఈ కేసులో పంజాబ్‌లోని ఖండూర్ సాహిబ్‌కు చెందిన స్వతంత్ర ఎంపీ అమృత్ పాల్ సింగ్ బావ అమర్ జోత్ సింగ్ నిందితుడు. మార్చి 2023లో కెనడాలోని ఒట్టావాలోని భారత హైకమిషన్ వద్ద ఖలిస్తాన్ మద్దతు దారులు భారత వ్యతిరేక నినాదాలు చేయడం, కమిషన్ గోడపై ఖలిస్థాన్ జెండాలు వేయడం, హ్యాండ్ గ్రెనేడ్‌లు విసిరి నిరసన తెలిపారని ఎన్ఐఏ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. గతేడాది ఒట్టావాలోని హైకమిషన్‌పై దాడి తర్వాత భారత్, కెనడా మధ్య సంబంధాల్లో చీలిక ఏర్పడింది. ఈ విషయం ఎంతగా పెరిగిందంటే, భద్రతను పేర్కొంటూ కెనడాలోని 41మంది దౌత్యవేత్తలను భారత్ వెనక్కి పిలిపించింది,దీనికి ప్రతిస్పందన గా కెనడా కూడా తన దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించింది. కొంతకాలం తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు సాధారణ స్థితికి వచ్చాయి. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు భారత్‌పై నిందలు వేయాలని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రయత్నించడంతో ఈ నిరసనలు చెలరేగాయి. ఆ తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జూన్‌లో బ్రిటిష్ కొలంబియాలోని గురుద్వారా వెలుపల నిజ్జర్‌ను కాల్చి చంపడం గమనార్హం. కెనడా, బ్రిటన్, యుఎస్ రాయబార కార్యాలయాలతో సహా వివిధ ప్రదేశాలలో నిరసనలు జరిగాయి. ఖలిస్థాన్ అనుకూల నిజ్జర్‌ను భారతదేశం చంపిందని ఆరోపించింది.

## పోర్ట్‌బ్లెయిర్ ఇక శ్రీవిజయపురం

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. చోళ సామ్రాజ్యంలో నౌకదళ స్థావరంగా ఉన్న ఈ భూభాగం.. ప్రస్తుతం మన దేశ వ్యూహాత్మక, అభివృద్ధి ఆశయాలకు కీలక కేంద్రంగా పని చేస్తోందన్నారు. మన జాతీయ పతాకాన్ని మొట్టమొదటిసారిగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇక్కడే ఎగరవేశారని గుర్తుచేశారు. వీర్ సావర్కర్‌తో పాటు అనేకమంది స్వాతంత్య్ర సమరయోధులను బంధించిన సెల్యూలర్ జైలు కూడా ఇక్కడే ఉందన్నారు.ం

## టీచర్లకు హెల్త్ కార్డులు అందచేస్తాం: దామోదర

సంగారెడ్డి,సెప్టెంబర్13(నమస్తే ఉదయం):

విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సమాజ నిర్మాణం బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉందని దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆందోలు నియోజకవర్గ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రధానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అందోలు నియోజక వర్గం ఎడ్యుకేషనల్ హబ్ అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. త్వరలో డీఎస్సీ ద్వారా 6,000 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. అలాగే ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను అందజేస్తామని చెప్పారు. ఉద్యోగుల డీఏలు విడుదల చేయాలనే ఆలోచన సీఎం రేవంత్ రెడ్డికి ఉందన్నారు.





# నష్టం రూ.10,032 కోట్లు..!

(మొదటి పేజీ తరువాయి)

కొట్టుకుపోవడంతో నష్టం ప్రాథమిక అంచనాలకు మించి పోయిందని వివరించారు. ఖమ్మం పట్టణంలో మున్నేరు వాగుతో ఉన్న వరద ముప్పును నివారించేందుకు రిటైనింగ్ వాల్ నిర్మించడమే శాశ్వత పరిష్కారం అని స్పష్టం చేశారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి కేంద్రం తగినన్ని నిధులు కేటాయించేలా చూడాలని అధికారులను కోరారు. రిటైనింగ్‌వాల్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తనవంతు వాటాను భరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాకాసి తండా, సత్యనారాయణ తండాతోపాటు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న తండాల ప్రజలను సమీపంలోని సురక్షిత ప్రాంతాల్లో ఇళ్లను కేటాయిస్తామని.. నిర్మాణానికి అవసరమైన సహాయాన్ని కేంద్రం అందించాలని కోరారు.

### మేడారం అడవులకూ నష్టం

వరదలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించాక ఆదుకోవడం కన్నా ముందస్తు చర్యలతో నివారణ మార్గాలపై ఎక్కువ దృష్టిసారించాలని కేంద్ర బృందాలకు సీఎం సూచించారు. వర్షపాతం, వడగాలులు,, పర్యావరణ విపత్తులపై ముందస్తు సమాచారం, హెచ్చరికలు జారీ చేసేలా ఏర్పాట్లు ఉండాలని, వాటిపై దృష్టిసారించాలని కేంద్ర బృందానికి సూచించారు. భవిష్యత్తులో వరదలు వచ్చినప్పుడు ఆదుకునేందుకు తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉన్న పోలీసు బెటాలియన్ సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఉపయోగించుకోవాలనే ఆలోచనను కేంద్ర బృందంతో సీఎం పంచుకున్నారు. మేడారం అటవీ ప్రాంతంలో వర్షాల కారణంగా 50 ఎకరాల్లో చెట్లు నేలమట్టం అవడంపైనా సమావేశంలో చర్చించారు. దేశంలో ఇప్పటి వరకు వర్షాలకు అడవుల్లో ఇలాంటి ఘటన జరిగినట్లు తమ దృష్టికి రాలేదని కేంద్ర బృందం అభిప్రాయపడింది.

దీనిపై కేంద్రం నుంచి నిపుణుల బృందాన్ని పంపి శాస్త్రీయంగా అధ్యయనం చేయించాలని సీఎం కోరారు. కేంద్రం నుంచి వచ్చిన అధికారుల బృందం రెండు బృందాలుగా విడిపోయి ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో పర్యటించింది. ఎన్‌డీఎంఏ సలహాదారు కల్నల్ కేపీ సింగ్ సారథ్యంలోని బృందాల్లో శాంతినాథ్, వివప్ప, మహేశ్ కుమార్, నాయల్‌కాన్సర్, రాకేశ్ మీనా, శశివర్ధన్ రెడ్డి ఉన్నారు. సమావేశంలో సీఎంతోపాటు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతికుమారి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, సంయుక్త కార్యదర్శి హరీశ్ ,ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### శాఖల వారీగా నష్టం వివరాలు..

శాఖ జరిగిన నష్టం (రూ.కోట్లలో)

( ప్రాథమిక అంచనాలు)

1 రోడ్ల భవనాల శాఖ, 7,693
2 అర్బన్ డవల్‌పమెంట్ 1216.57
3 నీటిపారుదల శాఖ 483
4 తాగునీటి సరఫరా విభాగం 331
5 వ్యవసాయ శాఖ 231.13
6 విద్యుత్తు శాఖ 179
7 కమ్యునిటీ అసెట్స్ 70.47
8 పాఠశాల భవనాలు 27.31
9 గృహనిర్మాణం 25.30
10 మత్స్యశాఖ 56
11 పశుసంవర్ధక శాఖ 4.35
12 మృతులు 1.40

## ప్రజాపాలనలో ప్రతిపక్షాలపై
# దాడులు దారుణం

(మొదటి పేజీ తరువాయి)

అంటూ ఆయన ధ్వజమెత్తారు. ప్రజాపాలనలో ప్రతిపక్షాలు మీటింగ్ పెట్టుకోవడానికి కూడా అనుమతి లేదా? అని నిలదీశారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ ఆనాటి ఎమర్జెన్సీ రోజులను అమలు చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. బీఆర్ఎస్ సమావేశం పెట్టుకుంటే ముఖ్యమంత్రికి వెన్నులో వణుకెందుకని కేటీఆర్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలంటే సర్కారుకు ఎందుకింత భయమో చెప్పాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతల్ని గృహనిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని కేటీఆర్ చెప్పారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసిన అరికెపూడి గాంధీ అనుచరులైన కాంగ్రెస్ గూండాలను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిని వదిలేసి బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడం ఈ ప్రభుత్వం దిగజారుడు విధానాలకు నిదర్శనమని మండిపడ్డారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని.. బీఆర్ఎస్ నేతలపై ప్రభుత్వం జులుం చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించమన్నారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ తీరును రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రశ్నిస్తే చాలు ప్రజాప్రతినిధులపై కూడా దాడులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులకు దిగే సంస్కృతిని తీసుకొచ్చారని మండిపడ్డారు. తెలంగాణ ఇమేజ్ ను డ్యామేజ్ చేసేలా ప్రవర్తిస్తామంటే బీఆర్ఎస్ సహించదని స్పష్టం చేశారు.

ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని.. సమయం వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీకి కచ్చితంగా బుద్ధి చెబుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా ముందస్తు అరెస్టులు చేసిన తమ పార్టీ నేతల్ని బేషరతుగా విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# జైల్లో పెట్టి వేధించాలని చూశారు..

(మొదటి పేజీ తరువాయి)

చేసిన విషయం తెలిసిందే. అనంతరం విడుదలకు అవసరమైన పక్రియ పూర్తి కావడంతో బెయిలు మంజూరైన కొన్ని గంటల వ్యవధిలోనే ఆయన జైలు నుంచి బయటకు వచ్చారు. ఆప్ శ్రేణులు, కేజీవ్రాల్ అభిమానులు జైలు వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకొని ఆయనకు స్వాగతం పలికారు. వర్షం కురుస్తుండగా.. తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన వారందరికీ కేజీవ్రాల్

అభివాదం చేస్తూ కనిపించారు. ఈ సందర్భంగా కేజీవ్రాల్ మాట్లాడుతూ.. ఇంత వర్షంలోనూ పెద్ద సంఖ్యలో వచ్చినందుకు మీ అందరికీ ధన్యవాదాలు. నా జీవితం దేశానికే అంకితం. లైఫ్‌లో ఎన్నో ఇబ్బందులు, కష్టాలు ఎదుర్కొన్నా. సత్యమార్గంలోనే నడిచినందు వల్లే దేవుడి ఆశీస్సులు ఉన్నాయి. నన్ను జైలులో పెట్టి మనో ధైర్యాన్ని దెబ్బతీద్దామని కొందరు అనుకున్నారు. కానీ, నేను జైలు నుంచి బయటకు వచ్చాక నా మనోధైర్యం వందరెట్లు పెరిగింది. భగవంతుడు చూపిన మార్గంలోనే నడుస్తూ.. దేశానికి సేవ చేస్తూనే ఉంటాను.

దేశాన్ని విభజించేందుకు ప్రయత్నించే శక్తులపై పోరాటం కొనసాగిస్తాను' అని తెలిపారు.కేజీవ్రాల్‌కు స్వాగతం పలికేందుకు జైలుకు వచ్చిన వారిలో ఆయన సతీమణి సునీతా కేజీవ్రాల్, పంజాబ్ సీఎం భగవత్ మాన్, ఢిల్లీ మంత్రి అతిశీ, మాజీ మంత్రి మనీశ్ సిసోదియా తదితరులు ఉన్నారు.

# తోడేళ్లకు తోడు..చిరుతల దాడి

### యూపిలో నిద్రలేని గ్రామాలు

లక్నో,సెప్టెంబర్13(నమస్తే ఉదయం):

ఉత్తర్‌ప్రదేశ్‌లోని బహరాయిచ్ జిల్లాను తోడేళ్ల గుంపు వణికిస్తోన్న తరుణంలో బిజ్నోర్ జిల్లా ప్రజల గురించి ఓ విషయం వెలుగులోకి వచ్చింది. జనావాసాల సమీపంలో చిరుతల సంచారం, దాడుల కారణంగా వారంతా ఏడాదిన్నరగా నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. 85 గ్రామాల్లో 60వేల మంది ప్రజలను చిరుతలు వణికిస్తున్నాయి. బిజ్నోర్ సమీపంలో 500వరకు చిరుతలు ఉన్నాయని యూపీ అటవీ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. బిజ్నోర్‌కు చెందిన పిలానా ప్రాంతం ఎప్పుడూ జనాలతో కళకళలాడుతూ ఉండేది. ఇప్పుడు వారంతా సాయంత్రం ఐదుకాగానే ఇంటికి చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఓ జాతీయ మీడియా కథనం పేర్కొంది. మా ఊరికి 15 కి.మీ.దూరంలో దట్టమైన అడవిలో చిరుతలు ఉంటాయి. అదేం మాకు కొత్త విషయం కాదు. కానీ 2023లో మా ప్రాంతంలో జరిగిన చిరుతదాడితో పరిస్థితి మొత్తం మారిపోయింది. ఆ దాడులు సర్వసాధారణమవడం తో మా జీవనశైలి తారుమారయిందని స్థానికుడు ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఆ ఒక్క గ్రామం పరిస్థితి మాత్రమే కాదని గుర్తించిన అధికారులు బిజ్నోర్‌లోని సుమారు 85 గ్రామాలను హైపర్ సెన్సిటివ్ కేటగిరీలోకి చేర్చారు. అవన్నీ అటవీ ప్రాంతానికి 8 కి.మీ. నుంచి 15 కి.మీల దూరంలోనే ఉన్నాయి. మ్యాన్ ఈటర్ చిరుతలను బంధించేందుకు కట్టుదిట్ట చర్యలు చేపడుతున్నప్పటికీ.. స్థానికులకు మాత్రం ఇంతవరకు ఎలాంటి ఊరట లభించలేదు. వాటిని బంధించేందుకు 107 పంజరాలను





ఏర్పాటు చేశారు. పొలాలకు వెళ్లేప్పుడు ఒక్కరే వెళ్లొద్దని, ఫోన్లు, రేడియోల్లో పెద్ద శబ్దంతో పాటలు పెట్టుకోవాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. చీకట్లో బయటకు వెళ్లొద్దని హెచ్చరించారు. ప్రస్తుతం ఈ ప్రయత్నాలన్నీ కొనసాగుతున్నప్పటికీ.. ఆగస్టు 29న మరో వ్యక్తి మ్యాన్ ఈటర్ చిరుత దాడిలో ప్రాణాలు కోల్పోయాడు. దాంతో ఏడాదిన్నర కాలంలో మృతుల సంఖ్య 25కు చేరడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ఇదిలా ఉంటే.. మరోపక్క తోడేళ్ల దాడులు ఉత్తరప్రదేశ్‌లో కలకలం సృష్టిస్తోన్న సంగతి తెలిసిందే. దాంతో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం 'ఆపరేషన్ భేడియా' పేరిట వాటిని బంధిస్తోంది. వీటి దాడుల్లో బహరాయిచ్ జిల్లాలో ఇప్పటివరకు 10 మంది ప్రాణాలు కోల్పోయారు.

## జిఎస్టీ గురించి అడిగితే
# బెదిరింపులా?

(మొదటి పేజీ తరువాయి)

మారింది. దీనిపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. సదరు వ్యక్తిపై కేంద్ర ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడిందని, ఇందుకు గాను సీతారామన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తోంది. ఈ ఘటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. అన్నపూర్ణ రెస్టారెంట్ చైన్ యజమాని వ్యవహారంలో నిర్మలా సీతారామన్ తీరు అవమానకరమైనది. పేద మధ్యతరగతి వర్గాల పట్ల జీఎస్టీ పన్ను భూతంలా మారింది. మోదీ ప్రభుత్వ చర్యలతో చిన్న వ్యాపారాల యజమానులు ఆర్థిక దాడులకు గురవుతున్నారు. అధికార అహంకారంతో వారీ విధంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. వస్తువులపై సరళమైన, ఏకరీతి, హేతుబద్ధమైన జీఎస్టీ అవసరమని కాంగ్రెస్ ముందు నుంచి చెబుతోందన్నారు.

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ విషయంపై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తన బిలియనీర్ స్నేహితులు నిబంధనలను వక్రీకరించడానికి, చట్టాలను మార్చడానికి, జాతీయ ఆస్తులను సొంతం చేసుకోవడానికి ప్రయత్నించినప్పుడు ప్రధాని వారికి రెడ్ కార్పెట్ పరుస్తారు. చిన్న వ్యాపారులు మాత్రం నోట్ల రద్దులు, పన్ను దోపిడులు, జీఎస్టీలను ఎదుర్కొంటున్నారు. చివరికి అవమానాలు కూడా వారికే అంటూ దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాథే మాట్లాడుతూ భాజపా తన సభ్యత డ్రైవ్‌లో భాగంగా ఓ సమావేశాన్ని నిర్వహించింది. అన్ని వర్గాల వారిని ఆహ్వానించి మరీ అవమానపరిచారు. భాజపా తమిళనాడు అధికారిక హ్యాండిల్ రెండు వీడియోలను రహస్యంగా రికార్డ్ చేసి షేర్ చేశారు. ఇది వారిని అవమానించినట్లే ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వాధి కారులకు చెప్పుకోకపోతే వారికి కావలసిన విధానపరమైన రూపకల్పనలు ఎలా జరుగుతాయని ప్రశ్నించారు.

ఈ వీడియోపై తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో తమిళనాడు భాజపా చీఫ్ కె అన్నామలై బహిరంగ క్షమాపణలు చెప్పారు.

## తెలంగాణలో శాంతిభద్రతలు కరువు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్ రెడ్డి కారణమని విమర్శలు గుప్పించారు. 'శాంతి భద్రతలు అదుపు తప్పడానికి చేసిందంతా చేసి భాగ్యనగరం బ్రాండ్ ఇమేజ్ గురించి రేవంత్ రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి బందోబస్తు ఇచ్చి దాడులు చేయించింది ఎవరు ..? రేవంత్ రెడ్డి, డీజీపీలు కాదా ..? నిన్నటి దాడులు ఎందుకు ఆపలేదు. అది గాంధీ చేసిన దాడి కాదు రేవంత్ రెడ్డి చేసిన దాడి. మమ్మల్ని ఇవాళ హౌజ్ అరెస్ట్ చేశారు. నిన్న గాంధీని ఎందుకు హౌజ్ అరెస్టు చేయలేదు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా. ఖమ్మంలో మా మీద దాడి చేస్తే పది రోజులైనా గుండాల మీద కేసులు పెట్టలేదు. నిన్న జరిగిన దాడికి కర్త,కర్మ, క్రియ అంతా రేవంత్ రెడ్డే. ఆయన డైరెక్షన్ లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి జరిగింది. ఎమ్జ్గ్న÷న్సీ కన్నా దారుణంగా రాష్ట్ర పరిస్థితులు తయారయ్యాయి.కోమటి రెడ్డి వెంకటరెడ్డి రెచ్చగొట్టే విధంగా మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలను కొట్టాలని చెప్పడం దారుణం. ఫిరాయింపులపై ఢిల్లీలో ఒక మాట గల్లీలో ఒక మాట మాట్లాడుతున్నాడు. ఎన్నిక లేకున్నా పీఏసీ ఛైర్మన్ ను నియమించి ఎన్నిక జరిగిందని రేవంత్ రెడ్డి చెప్పడం దుర్మార్గం. డీజీపీ పదవి చాలా ఉన్నతమైంది. ఆదర్శంగా ఉండాల్సిన డీజీపీ.. రాజకీయ కుట్రలో భాగమై ప్రతిపక్షాల గొంతును నొక్కాలని చూడాలను కుంటున్నారు. రాహుల్ గాంధీ దేశం బయట స్వేచ్ఛ స్వాతంత్య్రాల గురించి పాఠాలు చెప్పడం కాదు. తెలంగాణలో ఏం జరుగుతుందో చూడాలన్నారు. రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించి పార్టీ ఫిరాయింపులు జరిగాయి. పీఏసీ ఛైర్మన్ నియామకం కూడా అలాగే జరిగింది. మీరు మాపై విసిరే రాళ్లే అధికారంలోకి బీఆర్ఎస్ రావడానికి పునాది రాళ్లు. 16వ ఆర్థిక సంఘం గురించి మీరు తప్పుడు లెక్కలు చెబితే, మేము బాధ్యతాయుతంగా బలమైన వాదనను వినిపించాం. ఆంధ్రా నాయకుల మీద రేవంత్ రెడ్డి కపట ప్రేమ వలకబోస్తున్నారు. చిన్న జీయర్ స్వామిని, యాదాద్రి నిర్మాణానికి ప్లాన్ ఇచ్చిన ఆనంద సాయిని ఆంధ్రోడు అని రేవంత్ అన్నారు. మరి దానికి ఏమని సమాధానం చెబుతారు. పీఏసీ ఛైర్మన్ పదవికి ఎన్నిక జరిగిందని రేవంత్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదం. ఎలక్షన్ కాదు, సెలక్షన్ ద్వారా ఇది జరిగింది. కరీంనగర్ నుంచి వచ్చి హైదరాబాద్‌లో నీ పెత్తనం ఏంటని అరికెపూడి గాంధీ.. కౌశిక్ రెడ్డిని ప్రశ్నించారు.

దానికి సమాధానంగానే కౌశిక్ రెడ్డి మాట్లాడారు తప్పా? సెటిలర్ల మీద కౌశిక్ కామెంట్ చేయలేదు. ముందు రెచ్చగొట్టింది గాంధీ. ఆయనకు చెప్పిన సమాధానం అది'అని హరీశ్ రావు తెలిపారు. గురువారం జరిగిన తొక్కిసలాటతో తనకు భుజం నొప్పి మొదలైందని.. డాక్టర్లు ఎమ్మారై స్కాన్ తీసి 15 రోజుల పాటు ఫిజియోథెరపీ సూచించారని హరీశ్ వివరించారు.

జనరల్ న్యూస్ GENERAL NEWS
శనివారం ● 14, సెప్టెంబర్ 2024
నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక




సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

## కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి
# దేశానికి, ప్రజలకు తీరని లోటు

**- సిపిఎం పార్టీ మండల కార్యదర్శి జిఎం కురుమయ్య**

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 13(నమస్తే ఉదయం):**
భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా మార్సిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి దేశానికి, ప్రజలకు తీరని లోటని రాజేంద్రనగర్ మండల సిపిఎం కార్యదర్శి జి కురుమయ్య అన్నారు. శుక్రవారం సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సందర్భంగా రాజేంద్రనగర్ మండలం పార్టీ కమిటీ నాయకత్వం నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి జిఎం కురుమయ్య మాట్లాడుతూ ... కామ్రేడ్ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచి ఎస్ఎఫ్ఐ నాయకుడిగా జేఎన్ఎయూ యూనివర్సిటీలో జరిగిన ఎన్నికల్లో సుమారు మూడు పర్యాయాలు గెలిచారన్నారు. పార్లమెంట్ , రాజ్యసభ సభ్యుడుగా పనిచేయడంతో పాటు సిపిఎం పార్టీ నాయకుడిగా అంచలంచెలుగా ఎదిగి భారతదేశ ప్రధాన కార్యదర్శిగా ప్రజల కోసం పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందడం తీరని లోటని అన్నారు. ఈ సమావేశంలో మండల సిపిఎం కమిటీ సభ్యులు ఎన్ జంగయ్య, పార్టీ నాయకులు ఎం బాలస్వామి, వెంకటస్వామి, చెన్నయ్య నర్మదా తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్ఐ సాగర్ విధి నిర్వహణలో మార్గదర్శకులు: సి డి సి చైర్మన్ చెన్నకేశవరెడ్డి

**కొత్తకోట, సెప్టెంబర్ 13(నమస్తే ఉదయం):**
కొత్తకోట పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐ గా పని చేసిన సాగర్ భూత్పూర్ పోలీస్ స్టేషన్ కు బదిలీ పై వెళ్తున్న సందర్భంగా సి డి సి చైర్మన్ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు సన్మానించి వీడ్కోలు పలికారు. సందర్భంగా సి డి సి చైర్మన్ చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ ఏఎస్ఐ



సాగర్ విధి నిర్వహణలో ఎంతో బాధ్యతాయుతంగా పనిచేశారని తోటి సిబ్బందికి మార్గదర్శకంగా ముందుకు ఏఎస్ఐ సాగర్ ను సన్మానించిన వారిలో కొత్తకోట మండలమాజీ వైస్ ఎంపీపీ గుంత మల్లేష్, కోఆప్షన్ సభ్యులు అద్వాని శీను, ప్రేమ దానం, రహీం, ప్రభాకర్ రెడ్డి, రామచంద్ర యాదవ్, కృపాకర్ రెడ్డి, కొల్లంపల్లి, జమ్ములన్న, సురేందర్ తదితరులు ఉన్నారు.

## విద్యుత్ సేవలో ఇబ్బందులు లేకుండా చూడండి

**- టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్**

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 13(నమస్తే ఉదయం):**
విద్యుత్ సేవల్లో అంతరాయం లేకుండా బాధ్యతగా అధికారులు ఇబ్బంది పనిచేయాలని టిజిఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ సూచించారు. శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని



సిఎండి ముషారఫ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజేంద్రనగర్ డివిజనల్ ఇంజనీర్ రత్నాకర్ రావు

శివరాంపల్లిలో గల విద్యుత్ డి ఈ కార్యాలయాన్ని సిజిఎం ఆనంద్, రాజేంద్రనగర్ ఎస్ ఈ శ్రీరామ్ రామ్మోహన్ లతో కలిసి సందర్శించి డివిజన్లో ఉన్న పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యుత్తు వినియోగదారులకు ప్రభుత్వం అందించాలని లక్ష్యాలను బాధ్యతాయుతంగా అందించాల్సిన అవసరం అన్నారు.

కొత్త సర్వీసులను సత్వరమే విడుదల చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజనల్ ఇంజనీర్ రత్నాకర్ రావు, ఏడిఈ లు ఈశ్వర్ ప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాస్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ బస్సును ఢీకొన్న కారు

**కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలు**

**కొత్తకోట, సెప్టెంబర్ 13(నమస్తే ఉదయం):**
కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో మదర్ తెరిస్సా జంక్షన్ దగ్గర ఆర్టీసీ స్కూల్ బస్సును కారు ఢీ కొట్టిన సంఘటన నేషనల్ హైవే 44 పై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొత్తకోట మండలం అమడబాకుల గ్రామంలోని మోడల్ స్కూల్లో చదివే విద్యార్థిని విద్యార్థులను ఎక్కించుకొని మదర్ తెరిసా జంక్షన్ దగ్గర కొత్తకోటలోకి మలుతున్న క్రమంలో హైదరాబాదు నుండి కర్నూలు వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి బస్సును ఢీకొనడంతో బస్సు డోర్, కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయ్యిందని తెలిపారు. బస్సులోని విద్యార్థులకు ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని కారులో ప్రయాణిస్తున్న కారుడ్రైవర్ కు మరో ఇద్దరికి గాయాలు అయ్యాయని చెప్పారు. వేగంగా వచ్చి స్కూల్ బస్సును ఢీకొన్న కారు డ్రైవర్ పై కేసు నమోదు చేయాలని ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మంజునాథ రెడ్డి తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 13(నమస్తే ఉదయం):**
వ్యవసాయ విశ్వవిద్యాలయం 11 కెవి విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10:30 నుండి 11 గంటల వరకు గోల్డెన్ సిటీ, డైమండ్ సిటీ, బెస్ట్ ప్రైస్, కాందారి హిల్స్, శ్రీదేవి కాలనీ లలో చింతల్ మెట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:00 నుండి 11:30 వరకు వాదేహి సులేమాన్ నగర్, అక్బర్ హిల్స్, బాసిద్ బాబా నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుండి 12 గంటల వరకు బసిద్ బాబా నగర్ ,అక్బర్ హిల్స్ ,చింతల్ మెట్, ఇక్బాల్ ఫంక్షన్ హాల్ లలో, పహడి విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఒకటిన్నర వరకు సులేమాన్ నగర్ చింతల్ మెట్ పహడి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాల అంతర్యామి ఉంటుందని శివరాంపల్లి సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హరినాథ్ చారి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ సరఫరా అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**హిమాయత్ సాగర్ సెక్షన్‌లో...**

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో గల సన్ సిటీ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు హిమాయత్ సాగర్, వెస్ట్ ఎండ్ కాలనీ, గందం గూడ, శాంతినగర్, లక్ష్మీ నగర్, హైదర్ షాకోట్ లలో, హైదర్ షా కొట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 11:30 నుండి 12 గంటల వరకు వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రస్థా కాలనీ, తిరుమల గార్డెన్, రాధా రీట్ పి ఆర్ ఎస్ %జూష్టుంవ%-2, పవన్ హార్మోని విల్లాస్, బచ్ పన్ స్కూల్, పద్మశ్రీ హిల్స్ కొంత ప్రాంతం, మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు మిలిటరీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మ్యాప్లే టౌన్, విశ్వాస నగర్, స్పెషల్ బ్లాక్, బి బ్లాక్, సన్ సిటీ ప్రధాన గేట్, మధ్యాహ్నం 12:30 నుండి 1:00 వరకు ఖాళీ మందిర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోగల ప్రాంతాలైన శివ సాయి నగర్ ఫేస్ వన్, పేస్ -2, బైరాగి గూడ, శివపురి, సంజయ్ గాంధీనగర్, సంఘం సిటీ, భవాని నగర్ కాలనీ, ఇండస్ వ్యాలీ ప్రాంతాలలో, సాయిరాం నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటిగంట నుండి ఒకటిన్నర వరకు సాయిరాం నగర్ కాలనీ, సాయిరాం ఎంక్లేవ్, సాయి హర్ష కాలనీ, సౌభాగ్యనగర్ కాలనీ, పి అండ్ టి కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒకటిన్నర నుండి రెండు గంటల వరకు పి అండ్ టి కాలనీ ఏ బి సి డి , స్పెషల్ బ్లాక్స్, సన్ సిటీలలో, స్నేహిత హిల్స్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పీరం చెరువు విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 11 నుండి 12:30 వరకు పీరం చెరువు గ్రామం,



ఎంపైర్ ఇన్ సిగ్నయ్, వసతి ఆనంది, గిరిదారి అపార్ట్మెంట్, షాదన్ ఇన్స్టిట్యూషన్స్, భాగ్యనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒకటిన్నర నుండి రెండు గంటల వరకు నర్సారెడ్డి కాలనీ, పద్మశ్రీ హిల్స్, భాగ్యనగర్ కాలనీ, రాధానగర్, కేకే-3, రాధా నగర్ ఫేస్ 1, హీరా కాలనీ, ఇంద్రారెడ్డి కాలనీ పరిధిలలో వివిధ మరమ్మత్తుల నిర్వహణ నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

**గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్‌లో...**

గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో పహల్ ఫుడ్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11:30 నుండి 12 గంటల వరకు ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీ పరిశ్రామిక వాడ, మధుబన్ వాటర్ ట్యాంక్ ప్రాంతం లలో, శివాజీ నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12:30 నుండి 1:00 వరకు జల్పల్లి పారిశ్రామిక వాడ, శివాజీ నగర్ పారిశ్రామిక వాడ, శివాజీ నగర్ ప్రాంతం లలో వివిధ మరమ్మత్‌ల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ జుబేరుద్దీన్ తెలిపారు.

**శంషాబాద్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో...**

శంషాబాద్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు మధురా నగర్, శ్రీనివాస కాలనీ, ఆదర్శనగర్, 9 గంటల నుండి 10 గంటల వరకు శంషాబాద్, కోత్వాలు కూడా విద్యుత్ ఫీడర్ పరిధిలో శంషాబాద్,హుడాకాలని, సిద్ధాంతి, ఆర్.బి నగర్, కోత్వాలు గూడ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాష తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరానికి సహకరించాలని ఆయన కోరారు.

**ఇబ్రహీం బాగ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో...**

ఇబ్రహీం భాగ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో అల్కాపూర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుండి రెండు గంటల వరకు క్యూ క్యూ కాలనీ, స్కైలా, పెంటయ్య నగర్, కే ఎన్ ఆర్ హిల్స్, డైమండ్ హిల్స్, వినాయక నగర్ ఫేస్-2, అల్కాపూర్ న్యూ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి రెండు గంటల వరకు అల్కాపూర్ రోడ్డు నెంబర్ 14 నుండి 22 వరకు, తుల్జారాం విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటిగంట నుండి మూడు గంటల వరకు అల్కాపూర్ రోడ్డు నెంబర్ 22 నుంచి 30 వరకు, ఫ్రెండ్స్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుండి 11:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇబ్రహీం బాగ్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్ తెలిపారు. ఈ విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగ దారులు సహకరించాలని ఆయన కోరారు.

# కరడుగట్టిన సైబర్ నేరస్థుడు ముడావత్ కిషన్ @ కృష్ణ అరెస్ట్

**కొత్తకోట, సెప్టెంబర్ 13(నమస్తే ఉదయం):**
గత మూడు, నాలుగు సంవత్సరాగా రెండు రాష్ట్రాలకు సంబందించిన అమాయక ప్రజలను ఇండియా బుల్స్ , ధని , ముద్ర లోన్స్ పేరు మీద సైబర్ క్రైమ్ ద్వారా దోచుకుంటున్న కరడు కట్టిన నేరస్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. డి.ఎస్.పి రత్నం తెలిపిన వివరాల ప్రకారం... ప్రధాన సూత్రదారి అయిన నర్సింగ్ నాయక్, కురుమూర్తి , రాతలవత్ రమేశ్, ఇస్లావాత్ రాములు ఏ బాబ, కొత్తపల్లి ఉమేశ్, బోయ వీరేష్, ఇద్దరు మైనర్లు ఎనిమిది మందిని పెద్దమందడి మండలం అరెస్ట్ చేసి జైలుకు పంపారు.

పామిరెడ్డిపల్లి తండా కు చెందిన ముడావత్ రమేశ్ పై కేసు నమోదు చేసి విచారించగా శుక్రవారం పామిరెడ్డిపల్లి తండాకు చెందిన మరొక నేరస్తుడు ముడావత్ కిషన్ ఏ కృష్ణ పట్టుకొని విచారించగా అతను మేస్త్రి పనుల గురించి గల్ఫ్ దేశాలైన ఖతార్, సౌదీ అరేబియాకు వెళ్ళి 2006 నుండి 2012 వరకు పనిచేసినాడు. తరువాత 2013 సంవత్సరములో ఇండియాకు తిరిగి వచ్చి మామిడిమాద తండాకు చెందిన సునీతను వివాహం చేసుకున్నాడు. పెళ్లి తరువాత మళ్ళీ గల్ఫ్ దేశాలకు వెళ్ళి అక్కడ 2020 వరకు ఉన్నాడు. ఇండియా కు తిరిగి వచ్చిన తరువాత హైదరాబాద్ లో ఆటో నడిపినాడు. ఆప్పుడు తన చిన్న తమ్ముడైన రాకేశ్ ద్వారా అతని స్నేహితుడు వడుత్యావత్ రమేశ్ ఏ లడ్డు రమేశ్ , వడుత్యావత్ రమేశ్ ఏ చెట్కి రమేశ్ వ్యక్తి ద్వారా సైబర్ నేరాలు చేస్తున్నారని తెలుసుకున్నాడు. తరువాత బీహార్ రాష్ట్రం లోని పాట్నా కు వెళ్ళి అక్కడ వడుత్యావత్ రమేశ్ ఏ లడ్డు రమేశ్, వడుత్యావత్ రమేశ్ ఏ చెట్కి రమేశ్, హరీష్ , నరేశ్ ల సహకారముతో సైబర్ నేరాలు ఎలా చేయాలో నేర్చుకున్నాడు. అక్కడే కొన్ని నెలల పాటు సైబర్ నేరాలకు పాల్పడి డబ్బులు సంపాదించిన తరువాత వనపర్తికి వచ్చి గత రెండు ఏళ్లుగా ముద్ర , ఇండియా బుల్స్/ ధని అనే లోన్ ఆప్స్ పేరుతో సైబర్ నేరాలకు పాల్పడి అమాయక ప్రజలను మోసం చేసి వచ్చిన దాదాపుగా ఒక కోటి రూపాయల డబ్బుతో వనపర్తిలో రెండు ఇంటి ప్లాట్లు కొనుగోలు చేశాడు. తన తండాలో ఆదునిక వసతులతో దాదాపు 65 లక్షలతో రెండు అంతస్తుల ఇల్లు నిర్మించుకున్నాడు. 7 నెలల క్రితం మారుతి సుజుకి బ్రీజా కార్ ఖరీదు చేశాడు.



సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డి.ఎస్.పి

సైబర్ నేరాలలో ఆరితేరిన తరువాత తన తండా వాసులకు కూడ శిక్షణ ఇచ్చారు.ఇతను తన ఆర్థిక నేరాలకు తెలుగు రాష్ట్రాల్లో అమాయక ప్రజలను టార్గెట్‌గా ఎంచుకున్నాడు. ఇతని ద్వారా శిక్షణ పొందినవారు పాట్నా, ఢిల్లీ, కలకత్తా, వనపర్తిలో కూడ ఆఫీసులు ప్రారంభించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు.

ఇతని వద్ద ఇంటి ప్లాట్లకు సంభందించిన డాక్యుమెంట్లు, మారుతి సుజుకి బ్రీజా కార్,వివిధ బ్యాంకులకు చెందిన అకౌంటు బుక్కులు, పాస్ పోర్ట్, మూడు మొబైలు ఫోన్లు, రెండు కి ప్యాడులను స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్ గురించి ఆత్మకూర్ కోర్టులో హాజరు పరిచారు.


ఈ కేసు విచారణను తెలంగాణ సైబర్ సెక్యూరిటి బ్యూరో డైరెక్టర్ షికా గోయల్, డిజిపి ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా SP గిరిధర్ అధ్వర్యంలో వనపర్తి డి.ఎస్.పి పర్యవేక్షణలో కొత్తకోట ఎస్ఐ మంజునాథ్ రెడ్డి, శ్రీ రంగాపూర్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, జిల్లా పోలీసు సిబ్బంది సహకారంతో జిల్లా సైబర్ సెక్యూరిటి ఇంచార్జి డి.ఎస్.పి. రత్నం, కొత్తకోట సి ఐ రాంబాబు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణను నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్న సీఎం రేవంత్: మాజీ మంత్రి హరీష్ రావు

**బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఎప్పుడైనా దాడులు జరిగాయా.!**

**రేవంత్ పాలలో ఎమర్జెన్సీని తలపించే విధంగా ఉంది : రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి**

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 13 (నమస్తే ఉదయం):**
సీఎం రేవంత్ రెడ్డి కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడు తున్నారని రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో భాగంగానే ప్రతి పక్ష నాయకుల ఇళ్లపై దాడులు చేయిస్తున్నారని, అక్రమంగా నిర్బంధిస్తున్నారని విమర్శించారు. కోకాపేట లోని మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇంటికి వెళ్లి పోరెడ్డి ధర్మారెడ్డి బృందం పరామర్శించారు. ఈ సందర్భంగా పోరెడ్డి ధర్మారెడ్డి మాట్లాడుతూ...గురువారం డిసిపి ఆఫీసులో పోలీసులు కొందరు కావాలనే హరీశ్‌రావును గాయపరిచారని తెలిపారు. చేయి నొప్పి పెడుతున్నదని అరిచినా.. కనీసం కనికరం లేకుండా పోలీసులు



ఇష్టానుసారంగా వివరించడం వల్లనే ఆ నొప్పి మరింత పెరిగిందన్నారు. దాడుల సంస్కృతిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆహ్వానిస్తుందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఎప్పుడైనా దాడులు జరిగాయా అని నిలదీశారు. ఆయన విధ్వంసకర పరిపాలన హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్న దని ఫైర్ అయ్యారు. శాంతి భద్రతల పరిరక్షణలో కాంగ్రెస్ విఫలమైందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వము అన్ని వ్యవస్థలను విధ్వంసం చేస్తున్నారని పోరెడ్డి ధర్మారెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ నేతలను అక్రమంగా నిర్బంధిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం మౌనంగా ఉండటం దేనికి సంకేతమని విమర్శించారు. సరైన సమయంలో ప్రజలు ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. ప్రతిపక్షాలను అనచివేయాలని చూస్తున్నారని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఈ రకమైన నిర్బంధాలు, అణిచివేతలు చూడలేదు.

కాంగ్రెస్ పాలలో ఎమర్జెన్సీని తలపించే విధంగా ఉందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# పంచాయతీ బోర్డులపై ఓటర్ల జాబితా ప్రదర్శన

**కేటిదొడ్డి, సెప్టెంబర్ 13(నమస్తే ఉదయం):**
మండలంలోని కొండాపురం, వెంకటాపురం, ఇర్కిచేడు, పాగుంటా, పాతపాలెం, గువ్వలదిన్నె గ్రామాల తో సహా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయం నోటీస్ బోర్డ్ పై ఆ గ్రామ ఓటర్ల జాబితాను శుక్రవారం ప్రదర్శించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ గ్రామంలోని అన్ని వార్డుల్లో ఉన్న ఓటర్ల జాబితాను శుక్రవారం ఆ పంచాయతీ కార్యాలయం నోటీస్ బోర్డుపై అంటించామని



ఎంపిడిఓ కృష్ణమోహన్, ఆయా గ్రామాల కార్యదర్శులు తెలిపారు. ఓటర్లు ఆ జాబితాలో ఉన్న పేర్లను వివరాలను సరిచూసుకోవాలని వారు సూచించారు. ఓటర్ జాబితాలో ఎవరైనా తప్పులు ఒప్పులు గాని, మార్పులు చేర్పులు ఉంటే ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు సంబంధిత పంచాయతీ కార్యదర్శి కి లిఖితపూర్వకంగా రాసివ్వాలని సూచించారు. చివరి ఓటర్ల జాబితా ఈనెల 28 న ప్రదర్శించడం జరుగుతుందని అన్నారు.



## కమలానగర్‌లో 31 అడుగుల
# గణేశుడికి ఘనంగా పూజలు

**దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబర్ 13(నమస్తే ఉదయం):** దిల్ సుక్ నగర్‌లోని కమలానగర్‌లో నెలకొల్పిన 31 అడుగుల గణనాథుడికి అసోసియేషన్ ఆధ్వర్యంలో తులసి శ్రీనివాస పూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రవి చారి, సందీప్, పద్మనాభం, శ్రీపాదమ, సుప్రియ, నవ్య, అభిరా మ్ తేజ్, లోకేష్, అరహ్యా తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో యువకుడి మృతి



**గద్వాల, సెప్టెంబర్ 13(నమస్తే ఉదయం):** గుండెపోటుతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం గద్వాల జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కేటిదొడ్డి మండలం పాతపాలెం గ్రామానికి చెందిన షరీఫ్(26) గద్వాల పట్టణం రాయల్ లాడ్జి ఎదురుగా బేకరిషాప్ నిర్వాహిస్తు జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా శుక్రవారం ఉదయం ఇంటి వద్ద గుండెపోటు రాగ గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు.

## గద్వాల ప్రియదర్శిని మహిళ కళాశాలలో
# ఘనంగా ఫ్రెషర్స్ డే

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 13(నమస్తే ఉదయం):** గద్వాల పట్టణంలోని ప్రియదర్శిని మహిళ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సినియర్ విద్యార్థులు జూనియర్స్‌కు ఆటపాటలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. కలందర్ బాష హాజరయ్యారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ... చదువుతోనే మంచి భవిష్యత్ ఉందన్నారు. కళాశాల ప్రశాంత వాతావరణంలో విశాలమైన తరగతులతో ఆధునిక వసతులతో ఉత్తమమైన








అధ్యాపకులతో ఉందని విద్యార్థినులు ప్రతి ఒక్కరు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రయత్నంచాలని, తమ భవిష్యత్తుకు ఉత్తమ బాటలు వేసుకొని తాము కోరుకున్న లక్ష్యాలను సాధించేందుకు ప్రయత్నించాలని సూచించారు. అనంతరం కళాశాలకు సంబంధించిన వివిధ గ్రూపుల విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో అధ్యాపకులు, బోధ నేత సిబ్బంది, విద్యార్థినీలు పాల్గొన్నారు.

## పి.ఆర్.టి.యు. తెలంగాణ
# రాష్ట్ర కార్యదర్శిగా కె యస్ యోగెందర్

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 13(నమస్తే ఉదయం):** పి ఆర్ టి యు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గా గద్వాల జిల్లా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల



ధరూర్, ధరూర్ (మండలం) ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎంగా పనిచేస్తున్న కె.యస్.యోగేందర్ నియమితు లయ్యారు. ఈ మేరకు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు గార్ల పాటి ఉమాకర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారా యణ ఉత్తర్వులు జారీచేశారు. కె యస్ యోగెందర్ నియామకం పట్ల రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వేణు గోపాల్ రెడ్డి,జిల్లా అధ్యక్షుడు తిమ్మప్ప, ప్రధాన కార్యదర్శి సాతర్ల రఘు, గౌరవ అధ్యక్షుడు భరత్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. సందర్భంగా యోగెందర్ మాట్లాడుతూ. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కేవలం తెలంగాణ పి ఆర్ టి యుతోనే సాధ్యం అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తమ సంఘం ముందు ఉంటుందన్నారు.

## ఉప్పేర్ అంగన్‌వాడీ కేంద్రంలో
# పోషణ మాసోత్సవాలు

**ధరూర్, సెప్టెంబర్ 13(నమస్తే ఉదయం):** రేవులపల్లి సెక్టార్ లోని ఉప్పేరు గ్రామ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ఉప్పేర్ అంగన్ వాడీ టీచర్లు ఇందిరమ్మ, గాయత్రి, కృష్ణవేణి ఆధ్వర్యంలో పోషణ్ మాసోత్సవం సందర్భంగా బాలింతలకు, గర్భిణీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ఈసందర్బంగా వారు మాట్లాడుతూ... మహిళలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్ వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల ఎదుగుదల కోసం ప్రభుత్వం కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తోం దని, అయినప్పటికీ క్షేత్రస్థాయిలో రక్తహీనత, బరువు లోపాలు బయటపడుతూనే ఉన్నాయన్నారు.వీటికి చెక్‌పెట్టి, పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు మహిళా,శిశు సంక్షేమ శాఖ సెప్టెంబరు నెలను పోషణ మాసోత్సవంగా నిర్వహిస్తోందని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉండగలుగుతారని పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలు, 3నుంచి 6ఏండ్ల లోపు చిన్నారులు తప్పక పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశావర్కర్లు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



# పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఆర్టీసి బస్సులు నిలపాలని విద్యార్థుల ఆందోళన

## పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి



**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 13(నమస్తే ఉదయం):** గోనుపాడు గ్రామంలో ఆర్టీసి బస్సులు ఆపాలని శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబివిపీ నాయకులు మాట్లాడుతూ గద్వాల మండలం గోనుపాడు గ్రామం వద్ద ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఆర్టీసి బస్సులు ఆపకపోవడంతో విద్యార్థిని విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారన్నారు.

ముఖ్యంగా సాయంత్రం వేళ్లలో విద్యార్థీనీలు బస్సుల కోసం రోడ్ల మీద నిలిచిఉండటంతో ఆకతాయిల వేధింపులు ఎదుర్కొవలసివస్తుందని, దీంతో విద్యార్థినిలు కళాశాల నుండి గద్వాల పట్టణానికి నడుచుకుంటూ వస్తున్నారని వెల్లడించారు. గతంలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం వేళలో గద్వాల డిపో నుంచి ప్రత్యేక ఆర్టీసి బస్సులు నడిపించి, వెంటనే రద్దు చేశారని, ఈ విషయం డిపో మేనేజర్‌కు వినతి పత్రాలు ఇచ్చిన స్పందించ లేదని ఆరోపించారు. ఇప్పటికైన కావున అధికారులు ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉదయం మరియు సాయంత్రం వేళలో పాలిటెక్నిక్ కళాశాళ వద్ద ఉదయం, సాయంత్ర వేళలో ఆర్టీసి బస్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

అనంతరం గద్వాల ఆర్టీసి డిపో సీఐకి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిపో సీఐ మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏబివిపి జిల్లా కన్వీనర్ గణేష్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేష్. జిల్లా నాయకులు నరేష్, వీరశేఖర్, నరేష్, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# తక్కువ భూమి విస్తీర్ణం ఉన్న రైతులు

## ఉద్యాన పంటల సాగు చేస్తే ఉపాధి : అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య

**ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో ఎస్సీ ఉపప్రణాళిక కింద రైతులకు కూరగాయ విత్తనాలు, సేంద్రియ ఎరువులు, ప్లాస్టిక్ మల్చింగ్ షీట్ పంపిణీ**

**పెద్దమందడి, సెప్టెంబర్ 13(నమస్తే ఉదయం):** పెద్దమందడి మండలంలోని మోజర్ల లో గల ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక కింద 75 మంది షెడ్యూల్ కులాల రైతులకి మిరప, బెండ, వంగ కూరగాయల విత్తనాలు, సేంద్రియ ఎరువులు, సేంద్రియ పురుగుమందులు, ప్లాస్టిక్ మల్చింగ్ షీట్ పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య మాట్లాడుతూ.... తక్కువ భూమి విస్తీర్ణం ఉన్న రైతులు ఉద్యాన పంటల సాగు చేస్తే ఉపాధి సంవత్సరమంతా దొరకడంతో పాటు పెట్టిన పెట్టుబడికి వెంటనే రాబడి వస్తుందని పేర్కొన్నారు. ఉద్యాన పంటలు సాగుతో నష్టాలు చాలా తక్కువ అని చెప్పారు. రోజురోజుకు పెరుగుతున్న కూరగాయల డిమాండ్తో భవిష్యత్తులో సైతం కూరగాయలకు మంచి ధర ఉంటుందని ఆయన తెలిపారు. హైదరాబాదులో నేటికీ కేవలం 60% కూరగాయలు మాత్రమే స్థానికంగా ఉత్పత్తి అవుతున్నాయని, హైదరాబాద్ చుట్టుపక్కల 100 కిలోమీటర్ల పరిధిలో కూరగాయలు పండించుకునేందుకు వీలుందని, తద్వారా రైతులు గిట్టుబాటు ధర పొందవచ్చుని డాక్టర్ సైదయ్య





తెలిపారు. విత్తనాలు విత్తనాలు ఇతర ఇన్పుట్స్ తీసుకున్నారు రైతులు సలహాలు సందేహాలను అభివృద్ధి చేసుకునేందుకు కళాశాల శాస్త్రవేత్తలను ఎప్పుడైనా సంప్రదించవచ్చని తెలిపారు. ఉద్యాన రైతులకు సలహాలు సూచనలు ఇచ్చేందుకు ఎప్పుడైనా సిద్ధంగా ఉంటామన్నిర్కొన్నారు. రైతులకు 8200 విలువైన ఇన్పుట్‌లు సరఫరా చేసినట్టు ఎస్సీ సబ్ ప్లాన్ ఇంచార్జ్ బేబీ రాణి చెప్పారు.కార్యక్రమంలో జీవన ఎరువులు, సేంద్రియ పురుగుమందులపై డాక్టర్ షహనాజ్, కూరగాయల నర్సరీ పై డాక్టర్ శ్రీనివాస్ , ప్లాస్టిక్ మల్చింగ్ షీట్ పై చంద్రశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో కని మెట్ట, చిన్న మందడి, మోజెర్ల, మద్దిగట్ల, జయన్న తిరుమలాపూర్ షెడ్యూల్ కులాల రైతులు పాల్గొన్నారు.







రాజేంద్రనగర్‌లో మొబైల్‌లో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న బిజెపి నాయకులు, అంబేద్కర్ విగ్రహం వద్ద బిజెపి నాయకులు

# దేశంలో అత్యధిక సభ్యత్వ నమోదుగా బిజెపి పార్టీ

**- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేమ్ రాజ్**

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 13(నమస్తే ఉదయం):** కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వాన్ని ప్రజలు మూడోసారి ఆశీర్వదించి భారతీయ జనతా పార్టీలో స్వచ్ఛందంగా చేరడం వల్ల దేశంలోనే అతిపెద్ద పార్టీగా బిజెపి నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేమ్ రాజ్ అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు జి.బాబురావు ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యాక్రమం శాంతి నగర్ కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేమరాజ్ హాజరై మాట్లాడుతూ... డివిజన్ లో 20వేల సభ్యత్వమే లక్ష్యం గా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి జిల్లా సభ్యత్వ ఇంచార్జి మొంద్ర కొమురయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, గద్వాల జిల్లా సభ్యత్వ నమోదు ఇంచార్జ్ బొక్క బాల్ రెడ్డి , బిజెపి మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి ఎం వనితా రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు డి సత్యనారాయణ ముదిరాజ్ , దళిత మోర్చా రాష్ట్ర నాయకులు కోరని సదానందం , పార్టీ నాయకులు పీ సందీప్ ముదిరాజ్, హరికిషన్ జి , కొత్త సోల్కర్ రెడ్డి, కోరని క్రాంతి, విటల్ , కీర్తి శ్రీను, జి పద్మావతి ,పవన్ రాజ్, మల్లేష్ చారి, రాకేష్ గౌడ్, రమేష్, రాఘవేంద్రచారి, శశి వంశీ, తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్యను పట్టించుకోని జిహెచ్‌ఎంసి అధికారులు: బిజెపి అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 13(నమస్తే ఉదయం):** అత్తాపూర్ డివిజన్లోని తేజస్విని నగర్ కాలనీలో మ్యాన్ హొల్ పగిలి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని బిజెపి అధికార ప్రతినిధి రాచూరు రాజశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం

అత్తాపూర్ డివిజన్‌లోని తేజస్వి నగర్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని ఏ ఈ నరసింహా మూర్తి ,వర్క్ ఇన్స్పెక్టర్ రాజు ల దృష్టికి సమస్యను దృష్టికి తీసుకెళ్లిన పరిష్కరించలేదని ఆరోపించారు. స్థానిక కాలనీవాసులు ఎన్నోసార్లు అధికారులకు ఈ విషయాన్ని వివరించిన పరిష్కరించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్ల రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనులలో అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కాంట్రాక్టర్లు నాణ్యతగా పనులు చేపట్టడం లేదని దీంతో మ్యాన్ హొల్ పగిలి ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అక్కడ వర్షం వస్తే చెరువు తలపించే నీరు ఆగుతుందన్నారు. రాకపోకలు సాగించే వాహన దారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నార న్నారు. జిహెచ్ఎంసి అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.






మ్యాన్ హొల్ పగిలిన దృశ్యాన్ని పరిశీలిస్తున్న బిజెపి నాయకులు రాజశేఖర్

## జూరాల ప్రాజెక్టుపై
# మొసలి కలకలం

**గద్వాల ప్రతినిధి, సెప్టెంబర్13(నమస్తే ఉదయం):** ఎగువ కురుస్తున్న వర్షాలకు జూరాల ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. అంతేకాకుండా మొసళ్లు ఎక్కువగా వచ్చి చేరుతున్నాయి. శుక్రవారం ఉదయం కృష్ణా నది నుంచి ఓ మొసలి ఒడ్డుకు చేరుకుని



ప్రాజెక్టు సమీపంలోగల మిషన్ భగీరథ పంప్ హౌస్ ముందు ఉన్న జూరాల ప్రాజెక్టు రోడ్డుపై తిరుగుతుండటంతో గమనించిన మత్స్య కారులు గంటపాటు శ్రమించి మొసలిని జూరాల ప్రాజెక్టులోకి పంపించారు.


**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733